క్లుప్తంగా

ఆదారికి ఘన నివాళి



తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విశాఖ డెయిరీని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లిన ధీశాలి ఆడారి తులసీరావు అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఆడారి స్వగృహానికి బుధవారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తులసీరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

విజయనగరం టౌన్: వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 26న ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు శారదా సేవా సంఘం, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 3.30 గంటల నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, కుంకుమార్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

వేపాడ: మండలంలోని పాటూరులో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 500 రూపాయల నగదు, నాలుగు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

13 కేంద్రాలలో పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: ఈ నెల 22న జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు బొబ్బిలి పట్టణంలో 9 కేంద్రాలు, మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష నోడల్ అధికారి మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, 13 కేంద్రాలలో 4,228 మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతుందని, అభ్యర్థులంతా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కో ఆర్డినేటర్, పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు మాట్లాడుతూ, అభ్యర్థులు హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్నుతో పాటు ఆధార్ లేదా ఏదైనా ఐడీ ప్రూఫ్ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ సస్పెండ్‌పై విచారణ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి వీఆర్‌ఓ వి.అప్పలనాయుడు సస్పెండ్‌పై ల్యాండ్స్ అండ్ ఎక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల కొండగంగుబూడి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్‌ఓ అప్పలనాయుడును సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని డీసీ తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, ఆర్‌ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.

26 నుంచి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో బంగారమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవాలను ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బేత శ్రీదేవి,రవి దంపతులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 28న మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం చేయనున్నామని, గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చెరకు కాటాను సద్వినియోగం చేసుకోండి

- జేసీసీ సత్యనారాయణ

బొబ్బిలి రూరల్: చెరకు కాటాను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేన్ కమిషనర్ (జేసీసీ) జీవీవీ సత్యనారాయణ కోరారు. మండలంలోని రంగరాయపురంలో ఏర్పాటు చేసిన చెరకు కాటాను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎం అప్పారావు, సర్పంచ్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ ప్రయాస...

- జేబులు గుల్ల చేస్తోన్న ఆటో వాలాలు
- శివారు ప్రాంతాలకు వెళ్లాలంటే అడిగిన మొత్తం చెల్లించాల్సిందే
- ఆర్టీసీ ఆధ్వర్యంలో సిటీ సర్వీసులు నడపాలంటున్న నగర వాసులు



బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో జనాభాకనుగుణంగా అవసరాలు పెరుగుతున్నాయి. సొంత వాహనాలు లేని సామాన్య, మధ్య తరగతి ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. పండగ రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారు పడిన కష్టాలు ఇక చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వివిధ పనులపై పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లాలంటే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. 10 రూపాయలతో సాగిపోయే ప్రయాణానికి 100 రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చేందుకు బస్సులు వేసిన ఆర్టీసీ పట్టణంలో సిటీ సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పట్టణం విస్తీర్ణం దృష్ట్యా సిటీ సర్వీసులు నడపాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వపరంగా పట్టణంలో ఏవిధమైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులతో పాటు ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఆర్టీసి సిటీ సబర్బన్ సర్వీసులు నడపాలని పలువురు కోరుతున్నారు.

కష్టంగా ఉంది..

పట్టణంలోని వివిధ ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే కష్టతరమవుతోంది. ఆటోలు, రిక్షాలలో వెళితే ఖర్చు తడిసి మోపడవుతోంది. అలాగని నడిచి వెళితే చాలా సమయం పడుతుంది. వృద్ధులు, చిన్న పిల్లలు మరిన్ని కష్టాలు పడుతున్నారు. ఆర్టీసీ సిటీ బస్సులు నిర్వహించాలి.

– ఎస్. వెంకటేశ్వరరావు, ఉద్యోగి

శివారు కాలనీలకు బస్సులు వేయాలి..

పట్టణంలోని శివారు కాలనీలకు సిటీ బస్సులు నడపాలి. పూల్‌బాగ్, బాబామెట్ట, తదితర ప్రాంతాల నుంచి పట్టణంలోకి రావాలంటే కష్టంగా ఉంది. షేర్ ఆటోలు ఉండవు. ప్రత్యేక ఆటోల చార్జీలు భరించలేం. అదే సిటీ బస్సులు నడిపితే తక్కువ సమయంలో ,తక్కువ ఖర్చుతో రాకపోకలు సాగించవచ్చు.

– బి. శ్యామలరావు, ప్రైవేట్ ఉద్యోగి

ఆర్థిక భారం..

రింగురోడ్డు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రింగురోడ్డును ఆనుకుని ఉన్న చాలా కాలనీల్లో వేలాది మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు లేవు. ప్రత్యేక ఆటో చార్జీలను భరించ లేకపోతున్నాం. ఇక్కడ నుంచి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాలకు వెళ్లాలంటే రూ.40 నుంచి 50 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్టీసీ ద్వారా సిటీ బస్సులు నడిపితే కష్టాలు తప్పుతాయి.

– నీలకంఠం, చిరుద్యోగి.

బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు



విజయనగరం-పాలకొండ రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నెల్లిమర్ల: విజయనగరం – పాలకొండ రహదారిలో ఐదు బ్లాక్ స్పాట్స్ గుర్తించినట్లు విశాఖపట్నం – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పథకం మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా విజయనగరం – పాలకొండ రహదారిని బుధవారం పరిశీలించారు. నెల్లిమర్ల పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌ను అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ప్రత్యేకించి కన్సల్టెన్సీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని విజయనగరం – పాలకొండ రహదారిని ప్రమాదకరమైన రహదారిగా గుర్తించినట్లు తెలిపారు. ఈ రహదారిలో ఐదు ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి, ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీసీఐసీ అభివృద్ధి పథకంలో భాగంగా విశాఖపట్నం, శ్రీకాళహస్తి – ఏర్పేడు పారిశ్రామికవాడల్లోని 17 వేల ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు బి. హేమసుందర్, పీకేపీ ప్రసాద్, టి. మధుసూదన్, ప్రకాశ్ బాలచంద్ర, జె .రామస్వామి, భాను, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో సంఘ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఆంధ్రా కొప్పుల వెలమ సంక్షేమ సంఘం రూపొందించిన 2023 వార్షిక క్యాలండర్‌ను సంఘ ప్రతినిధులు స్థానిక ఉడా కాలనీలోని సంఘ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. జాతీయ కన్వీనర్ రావు శంబంగి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేషనల్ అవార్డీ ఉపాధ్యాయుడు కొరుపోలు సత్యారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొరిపిరెడ్డి అప్పలనాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల విభాగం ఎల్ఆర్ బాబాజీ, ప్రతినిధులు తెంటు అశోక్‌బాబు, శీర సత్యనారాయణ, పూడి సూర్యనారాయణ, రాజాన వెంకట్రావు, కొరుపోలు రమేష్, చుక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల కన్వీనర్ల నియామకం



కన్వీనర్లతో ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల: నియోజకవర్గానికి సంబంధించి జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు మండల కన్వీనర్ల నియామకాలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం చేపట్టారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలానికి గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీకి మజ్జి గణేష్, పూసపాటిరేగ మండలానికి మహంతి శ్రీనివాసరావు, డెంకాడ మండలానికి సారిక గౌరీశంకర్, భోగాపురం మండలానికి బైరెడ్డి ఎర్ర అప్పలనారాయణరెడ్డి మండల కన్వీనర్లుగా నియమితులైనట్లు పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు వీరిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభినందించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పట్నుంచే కృషి చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా కుమిలి కల్వర్టు



ఒకవైపు రక్షణ గోడ లేకుండా ఉన్న కుమిలి కాలువ కల్వర్టు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక టొంపలపేట సమీపంలో ఉన్న కుమిలి కల్వర్టు అత్యంత ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల కిందట వర్షాలకు కల్వర్టు రక్షణ గోడ పూర్తిగా కూలిపోయింది. ప్రధాన రహదారిలో ఇప్పటికే విస్తరణ పనులు జరుగుతుండడంతో కల్వర్టు నిర్మించేందుకు కాస్తా సమయం పట్టే అవకాశం ఉంది. అయితే కూలిన రక్షణ గోడ వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసులు స్టాపర్లను అరకొరగా ఏర్పాటు చేసినా, ప్రమాదకర మలుపు కావడంతో వాహనదారులు కాలువలో పడే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకముందే తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పగ మంచు



పూసపాటిరేగలో మంచుకు దెబ్బతిన్న మామిడి చెట్లు

- వేల ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం
- ఆందోళనలో రైతన్నలు

పూసపాటిరేగ: కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో మామిడి పంటకు నష్టం వాటిల్లుతోంది. కొన్ని చోట్ల పూత రాకపోవడం, మరికొన్ని చోట్ల పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవనశాఖాధికారులు తగిన సూచనలు, సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. ఈ పూత వచ్చినప్పుడు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. కాని కొన్ని రోజులుగా అధికంగా కురుస్తున్న మంచు వల్ల మామిడి దిగుబడికి కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడికి మంచు తీవ్రనష్టం కలిగిస్తోంది. గతేడాది కూడా ఇదే మాదిరిగా మంచు కురియడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా నష్టాలు తప్పేటట్లు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత మాడిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యానవన శాఖాధికారులు సలహాలు అందిస్తే బాగుంటుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.

నష్టం తప్పదు...

పది రోజులుగా కురుస్తున్న మంచుకు పూత మాడిపోయి కనిపించడం లేదు. ఇదేవిధంగా మంచు పడితే తీవ్ర నష్టం తప్పదు. ప్రకృతి వైపరీత్యాలు రైతులను కుదేలు చేస్తున్నాయి. ఉద్యానవన అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– కె.వెంకటరావు,
ఉద్యానవన రైతు, పూసపాటిరేగ

సలహాలు ఇస్తున్నాం



మామిడితోటకు నష్టం వాటిల్లకుండా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. పొగ మంచు అధికంగా ఉండడం వల్ల తేనెమంచు పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు ఆశిస్తే పూత మాడిపోతుంది. దీని నివారణకు లీటర్ నీటిలో 0.25 ఎం.ఎల్ ఫ్లోనోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి.మామిడి కాయలపై నల్లటి మచ్చలు రాకుండా లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

– జ్యోత్స్న,
ఉద్యానవన శాఖాధికారి, భోగాపురం

ఆధార్ కేంద్రంలో తనిఖీలు



దేశపాత్రునిపాలెం సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మజ

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ఎంపీడీఓ వై.పద్మజ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బందితో మాట్లాడి ఆధార్ సేవలు అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి ప్రస్తుతం అయిదు ఆధార్ కేంద్రాలు మంజూరు కాగా కంటకాపల్లి, దేశపాత్రునిపాలెం సచివాలయాల్లో సేవలు ప్రారంభమయ్యాయని చెప్పారు.ఈ కేంద్రాల్లో 5 ఏళ్ల లోపు చిన్నారులకు సంబంధించిన ఆధార్ సేవలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఆధార్ కార్డులో పేరు, ఇంటి పేర్ల మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలకు నామమాత్రపు రుసుం వసూళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. అంతకు ముందు కంటకాపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దశ మారింది..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాడు - నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ భవనాల దశ మారుతోంది. విద్య, వైద్య రంగాలతో పాటు ప్రభుత్వ భవనాల ఆధునీకరణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. దీంతో పాఠశాల, ఆస్పత్రి భవనాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



నాడు

నగర పాలక సంస్థ కార్యాలయం



నేడు

ఆకట్టుకునేలా నగర పాలక సంస్థ కార్యాలయం



నాడు

సంగీత కళాశాల భవనం



నేడు

కళకళలాడుతున్న సంగీత కళాశాల భవనం

'విశాఖ సంస్కృతి సంక్రాంతి' సంచిక ఆవిష్కరణ



సంచికను ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, విద్యార్థులు

విజయనగరం అర్బన్:

గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు 'విశాఖ సంస్కృతి సంక్రాంతి' మాసపత్రిక సంచికను ఆవిష్కరించారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన సంచిక ముఖచిత్రంపై ముద్రించిన భారతీయుల కట్టు, బొట్టు ఆకట్టుకుంది. మన సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తూ తమను భాగస్వామ్యం చేసిన కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి, తదితరులు

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

గంట్యాడ: ఆడపిల్లలపైవివక్ష చూపడం తగదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వి.లక్ష్మీకుమారి అన్నారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షల నిషేద చట్టం, లింగవివక్షత నిర్మూలనపై మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద బుధవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని తెలిస్తే చాలు గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భ్రూణ హత్యల నిరోధానికి, ఆడపిల్లల సంఖ్య పెంచేందుకు గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షల నిషేద చట్టం –1994ను ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందన్నారు. లింగ నిర్ధారణ చేయమని కోరిన వారిపై, లింగ నిర్ధారణ వివరాలు వెల్లడించిన స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శీతల్ వర్మ, వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఎర్రన్న, సుబ్బలక్ష్మి, పవన్ అశీష్ తదితరులు పాల్గొన్నారు.